# చిన్న సైకిలు

చేతి గడియారం వంక చూసుకున్నాడు చలపతి. ఎనిమిది దాటి పదినిమిషాలు. ప్రక్కింటి రేడియో మాత్రం ఎనిమిది గంటల ఒకనిమిషం దాటి 15 సెకన్లు అంది. ఎవరిదో గోడగడియారం సరిగ్గా ఎనిమిది గంటలు కొట్టింది. రెంటికన్నా తన గడియారం ఫాస్ట్ అనుకోలేదు చలపతి. శ్రీమతికోసం చూశాడు.

జడలో రోజూ మల్లెపూలు లేకున్నా మల్లెల్లాంటి చిరునవ్వుతో స్వాగతం పలికే శ్రీమతి ఆరోజు ఎదురుగా కనిపించకపోయేసరికి ఆశ్చర్యపోయాడు.

వచ్చింది తన ఇంటికేనా మరో ఇంటికా అని అటు ఇటు చూశాడు. పోలీసులు రేప్‌చేయలేదని ఈమధ్య ఒక కోర్టు అబద్ధం ఆడినట్లు చలపతి కళ్ళు అబద్ధం ఆడలేదు. 'ఎదురుగా ఉంది నువ్వు అద్దెకుంటున్న ఇల్లేనోయ్' అన్నాయి.

అప్పుడప్పుడు అనేకంటే దాదాపు ఎప్పుడూ అదే సమయానికి చలపతి ఆఫీసునుంచి ఇంటికి వస్తాడని చెప్పవచ్చు. ఆఫీసు వదలగానే ఇల్లు చేరుకొని భార్యను కొడుకును చూసుకోవాలనే ఆత్రుత చలపతికి ఉంది. కాని బస్సులవాళ్ళు ఎందుకు పట్టించుకుంటారు ఈ ఆత్రుతలు...అర్జంటులు?

రేట్లు రెట్టింపుచేసి రెండునెలలు అయిందో లేదో ఒక రాత్రికిరాత్రి మరో ఇరవైఅయిదు పైసలు పెంచారు. ప్రభుత్వరంగమే ఇలా దోపిడికి తలపడితే ఇక ప్రైవేట్‌రంగం గూర్చి చెప్పాలా? రోజురోజుకు బ్రతుకు భారమవుతున్నది ఆనో అని భార్యతో చెప్పుకొని వాపోతాడు చలపతి.

చలపతి చేయగలిగింది అంతే అని చలపతి అభిప్రాయం,

ఆరోజు తనకోసం చూస్తూ ఎదురుగా నుంచోని శ్రీమతిగూర్చి ఆలోచిస్తున్నాడు చలపతి.

గది ముందు నిల్చోని ఒకసారి లోనికి తొంగిచూశాడు అలా తొంగిచూడకుండా లోనికి వెళ్ళి అసలు విషయం కనుక్కోవచ్చు. కాని చలపతికి ఇంకా ఆశ ఉంది. ఆమె ఎదురుగా వస్తుందని తాను తలతో కూరుకొని వచ్చిన ఆఫీసు దుబ్బునంతా మంచులో తడిసిన మల్లెలాంటి చిరునవ్వుతో కడిగేస్తుందని.. ధరల భారం మోయలేక కృంగిపోయిన భుజాలమీద చేతులేసి ఆప్యాయంగా లోనికి తీసుకుపోతుందని .. అసలు ఈ క్షణాలేకదూ చలపతి ప్రాణాలకు లంగరు వేస్తున్నాయి. కాకపోతే పెరిగే .. ధరలు అబ్బే ధరలెక్కడ పెరుగుతున్నాయి అనే ఆర్థికమంత్రి స్టేట్‌మెంట్లు చలపతిని రైలుపట్టాలమీదికి ఈడ్చేవే!

చలపతి ఆశ అయిదు నిమిషాల ఆయుస్సు పోసుకుంది. అయినా శ్రీమతి వస్తున్న జాడలు కనిపించలేదు. RTC బస్‌లో ప్రయాణం చేసివచ్చిన మనిషి అయిదునిమిషాలు ఇంటిముందు నిల్చోవడమంటే నూటలా!

ఇక లాభంలేదని లోనికి వెళ్ళాడు చలపతి. ఆ తరువాత గంటకు శ్రీమతి చెప్పిన విషయం విని చలపతి గుండె తరుక్కుపోయింది.

"ఎదురింటి అబ్బాయి తొక్కే చిన్న సైకిలురిషా చూస్తూ గడపలో నిల్చున్నాడు శేషు. ఎంత రమ్మన్నా లోనికి రాలేదు. పాలు తాగలేదు. వాడికిష్టమైన బిస్కట్టు ముట్టలేదు . అలా విచారంగా చూస్తూ నిల్చున్నాడని చెప్పింది శ్రీమతి.

కొడుకు లేత మనసులోని బాధ అర్థంచేసుకున్నాడు చలపతి. తనకు కొనిస్తారో లేదో నన్న అనుమానం వుంటే శేషు అడగడు. అలా విచారంగా చూస్తుంటాడు. అదేమిటో తల్లి, తండ్రి కనుక్కోవాలి.

మరునాడు ఉదయం శేషు మొహంలో రోజులాటి హుషారు కనిపించలేదు

చలపతి కొడుకును దగ్గరికి తీసుకొని "ఏంటినాన్నా!" అని ఆప్యాయంగా అడిగాడు.

"డాడీ... నీను లేడూ... చిన్న సైకిలు తెచ్చుకున్నాడు వాళ్ళ డాడి నిన్న బజార్లో కొనిచ్చిండట. ." తన మనసులో మాట తండ్రికి చెప్పాడు శేషు.

"నీకు తెస్తానాన్నా అలాంటి సైకిలు" అన్నాడు చలపతి.

ఆ మాట వినగానే శేషు మొహంలో దిగులు మాయమయింది. సంబరంగా తండ్రి మెడచుట్టూ చేతులు వేశాడు.

ఆరోజు ఆఫీసుకి వెళ్లాడేగానీ .. చలపతి మనసంతా బజార్లచుట్టే తిరుగుతున్నది చిన్నసైకిలు రిషా ధర ఎంతో బేరమాడితే తక్కువ చెయ్యవచ్చుకాని .. డబ్బు వచ్చే మార్గమేది? ముందు ఆ చిన్న సైకిలు ధర ఎంతో కనుక్కోవాలనుకున్నాడు చలపతి. తనకు బాగా జ్ఞాపకం-చిన్నప్పుడు తను ఇలాంటి సైకిలు కావాలని మారాం చేస్తే తండ్రి తనను బుజ్జగించడం-తను ఎదురింటి డాబా అబ్బాయి దర్జాగా చిన్న సైకిలు రిషా తొక్కుతుంటే చూస్తూ నిల్చునేవాడు 'ఆ సైకిలు కొనడానికి ఎన్ని డబ్బులు కావాలో అన్ని మా నాన్నకు దొరకాలి' అని దేవునికి మొక్కుకునేవాడు — వచ్చేనెల డబ్బు రాగానే కొనిస్తా అంటూ చిన్నసైకిలు కొనడం దాటవేశాడు. ఆ 'వచ్చేనెల' ఎప్పుడూ వచ్చేది కాదు-రాలేదు కూడా!

డాబా అబ్బాయి చిన్న సైకిలు తొక్కుతుంటే తన మనసు తనకు అలాంటి సైకిలు లేనందుకు ఎంత బాధపడేదో చలపతికి బాగా గుర్తుంది అందుకే కొడుకు మనసును ఆ లేతమనసు లోని దిగులును అర్థం చేసుకోగలిగాడు. తండ్రి తనకు ఆ సైకిలు కొనివ్వలేకపోయాడు. ఎలాగైనా తాను తన కొడుక్కు కొనివ్వాలి అనుకున్నాడు చలపతి.

తనలా తన కొడుకు బాధపడకూడదనుకున్నాడు తనకు 'అలాంటి చిన్న సైకిలురాదు' అని కొడుకు దిగులుపడకూడదు అనుకున్నాడు-

సాయంకాలం ఆఫీసునుంచి సరాసరి చిన్న సైకిలు దొరికే బజారుకు వెళ్ళాడు చలపతి—వాటి ధరలు విని అతనికి తలతిరిగిపోయినంత పనయింది. తన చిన్నప్పుడు పదిహేనో, ఇరవై రూపాయలలో చిన్న సైకిలు దొరికేదని అతనికి జ్ఞాపకం. ఇప్పుడు రెండు వందలు మూడు వందలు నూట అరవై చివరికి తొంభై రూపాయలకంటె తక్కువ అదీ మామూలు చిన్న సైకిలు తప్ప ఇంకో సైకిలు లేదు.

తన కొడుకుకోరే చిన్న కోరిక వెల తొంభై రూపాయలు. తన చిన్న నాటికి ఇప్పటికి ఆ కోరిక వెల అయిదు రెట్లు పెరిగింది.

చలపతి జేబులో ఇరవై రూపాయలున్నాయంటే అది నెలలో మొదటి వారం, అయిదు రూపాయలున్నాయంటే అది రెండోవారం, అయిదు పైసలున్నాయంటే అది ఆఖరివారం. చిల్లర పైసలతోనే అతని జేబుకు నేస్తం. అలాంటిది ఉన్నఫలంగా తొంభై రూపాయలు అతని జేబు మోయాలంటె మాటలా!

బెగ్, బారో ఆర్‌స్టీల్ మూడు పద్ధతులున్నాయి. డబ్బు సంపాదించాలంటే, చలపతిది మధ్య తరగతి మధ్య తరగతి బతుకులకు అప్పు చేసే ధైర్యం, అవసరం వుంటాయి. అందుకే వారు మధ్యతరగతి.

ఎవరి దగ్గర ధైర్యం చేసి అడగాలా! అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు చలపతి అలా నడుస్తూ... ఆలోచిస్తూ బస్సు ఎక్కడం మర్చిపోయి ఇల్లు చేరుకున్నారు. ఆలస్యమయిందని చలపతికి తెలుసు కావాలనే చేశాడు. తను వెళ్ళేసరికి శేషు పడుకుంటాడు చిన్న సైకిలు ఏది డాడీ? అని అడిగాడు. తేలేదు. నాన్నా అని తన అశక్తతను వ్యక్తం చేసే అవసరం వుండదు అనుకున్నాడు. మరునాడు ఉదయం అడిగితే సాయంకాలం తెస్తానని అనవచ్చు అనుకున్నాడు.

కాని చలపతి వెళ్ళేసరికి శేషు మేల్కొనే వున్నాడు. తండ్రి చిన్నసైకిలు తెస్తాడని ఆశగా మాటిమాటికి గడపలోకి వచ్చి చూడసాగాడు.

చలపతి ఇంట్లో అడుగుపెట్టగానే "డాడీ" అంటూ పరగెత్తి వచ్చాడు. కాళ్ళను చుట్టేశాడు. చిన్న సైకిలు కోసం అటూ ఇటూ చూసాడు.

"చిన్నసైకిలు మంచిది దొరకలేదు నాన్నా రేవు తెస్తాను" కొడుకును ఎత్తుకుని అన్నాడు చలపతి.

శేషు మొహంలో దిగులు ఛాయలు కమ్ముకున్నాయి. 'నాకు తెలుసు డాడీ నువ్వు తేవు అంటున్నట్టుగా వున్నాయి శేషు చూపులు.

మొహమంతా చిన్నబుచ్చుకొని మవునంగా తల్లి దగ్గరికి వెళ్ళాడు.

రాత్రంతా మరునాడు తొంభై రూపాయలు ఎలా సంపాదించాలా అనే ఆలోచించాడు చలపతి.

మొదట వడ్డీవ్యాపారి సుందరమూర్తి గుర్తుకొచ్చాడు. శేషు పుట్టినప్పుడు చేసిన బాకి అయిదు వందల రూపాయలు అలాగే వుంది. నెలనెలకు ఏభయి రూపాయల వడ్డీ మాత్రం కడుతున్నాడు. అవసరం అలా తరుము కొచ్చింది. మరి? తను వినో ఒకరి నొకరు ఇష్టపడి వినో తల్లిదండ్రులను, తన అన్నను ఎదిరించాల్సివచ్చింది. కులాల అడ్డంకులు, బంధుత్వాల బంధనాలు వాళ్ళను బాధించలేదు. తాను అన్నయ్య చూసిన సంబంధం చేసుకున్నా ఈ కష్టాలు తప్పవని చలపతికి తెలుసు.

వ్యవస్థలోని లోపాలే తమ ఆర్థిక ఇబ్బందులకు కారణమని చలపతి నమ్మకం వ్యవస్థ మారాలి. కాని ఎలా? చలపతికి తెలియదు తాను నమ్మింది ఆచరించాడు. తనకు నచ్చింది చేశాడు. వ్యవస్థ మారుతుందని ఎదురు చూస్తున్నాడు.

సుందరమూర్తి మరో తొంభై రూపాయలు అప్పు ఇవ్వగలడా? గలడు. కాని ఇవ్వడు ముందు తన పాత బాకీ తీర్చమని పట్టు బడతాడు. కాబట్టి మరునాడు సుందరమూర్తిని దర్శించి ప్రయోజనం లేదు ప్రమాదం కూడా.

ఇంటాయన. . అదే ఇల్లు అద్దెకిచ్చినాయన దగ్గర ప్రయత్నించవచ్చు. కానీ మరునాడు ఇల్లు ఖాళీ చేయమనే ప్రమాదం వుంది. ఆర్థికంగా మంచిస్థితిలో ఉన్నవాళ్ళకే ఇల్లు అద్దెకివ్వడం రివాజు.

ఆ తరువాత పావుగంట సేపు ఆఫీసుచుట్టూ తిరిగింది చలపతి మనసు యు.డి.సి. మీనాక్షిని అడగవచ్చు మెడలో గొలుసు, చేతికి ఉంగరాలు... మరో ఆఫీసులో ఎల్.డి సి. భర్త స్కూటర్... తొంభై రూపాయలు అప్పివ్వదా జీతం రాగనే ఇచ్చేయడు...? అది నిజమా? అని ప్రశ్నించింది మనసు ఇంటి అద్దె చిల్లర సామానులు, బియ్యం, పాలు ముఖ్యంగా నూనె, కరెంట్, నీటిబిల్లు అన్నింటికీ పోను మిగిలేదెంత? ఆసలేం మిగలదు. ఏదో ఒకటి తక్కువయి తెచ్చుకోవాల్సిందే! తప్పు సరిపోని జీతానిదా! పెరుగుతున్న ధరలదా! చలపతి చాలా సార్లు ప్రశ్నించుకున్నాడు. కాని ప్రశ్నలన్నీ ఏకం కావాలిగా! చలపతి ఒక్కడేం చేస్తాడు?

ఏదో ఒకటి ఆపి ఇవ్వవచ్చు. ఇంటాయన కాళ్ళు పట్టుకుంటే ఒక నెల అద్దెకు ఆగడా?

మరునాడు మీనాక్షిని అడిగి తప్పనిసరిగా కొడుక్కి చిన్న సైకిలు కొనుక్కు రావాలని నిర్ణయించుకున్నాడు చలపతి.

—ఆఫీసుకు వెళ్ళగానే మీనాక్షి సీటువైపు చూశాడు. ఆమె ఇంకా రాలేదు? వస్తుందా? రాదా? రాకపోతే ఎవరిని అడగాలి? ఎవర్నయినా అడగవచ్చు. ఎవరిని· సుబ్బారావు, మోహన్రావు, ముకుందం... అందరూ నీలాంటివాళ్లే అప్పులు ఇస్తే తీసుకుంటారు కాని తిరిగి ఇవ్వలేరు భాయ్.

హమ్మయ్య! స్కూటర్ చప్పుడు వినిపించింది. మీనాక్షిని దించేసి వెళ్ళి పోయాడు భర్త. అతని ఆదాయం ముందు జీతం చిల్లరఖర్చు అని విన్నాడు చలపతి.

బలమంతా కూడదీసుకుని నవ్వుని మొహంమీదకి లాక్కున్నాడు. మీనాక్షి ఒక్కసారి చూస్తే నవ్వుని గుమ్మరించి విష్ చేద్దామనుకున్నాడు.

కానీ మీనాక్షి చలపతి వంక చూడలేదు. గబగబ ఆఫీసర్ గదిలోకి వెళ్ళింది.

పనిచేస్తూ అప్పుడప్పుడు మీనాక్షి సీటుని కనిపెడుతున్నాడు చలపతి. నవ్వును మొహంమీద రిజర్వ్‌గా ఉంచుకున్నాడు. ఒక్కసారయినా ఆమె చలపతి వంక చూడలేదు.

తాను అప్పు అడగబోతున్నట్టు ఆమెకెలా తెలిసింది? అడగొద్దనేకదా తన వైపు చూడటంలేదు. కాదేమో .. తాను అప్పు అడిగే విషయం ఆమెకెలా తెలుస్తుంది?

మధ్యాహ్నం దాకా అలా ఆలోచిస్తూనే వున్నాడు చలపతి, లంచ్ అవర్‌లో అడుగుదాం అనుకున్నాడు తీరా లంచవర్ వచ్చేసరికి ఆమెను కలసుకునే వీలు

పడలేదు. లంచు కాగానే అడగచ్చనుకున్నాడు కాని ఆ తరువాత మరో గంటైనా చలపతి మీనాక్షిని అడగలేకపొయ్యాడు.

చివరికి ఆఫీసు వదిలే టైం గంట వుందనగా ధైర్యంచేసి వెళ్ళాడు. ఎలా సంభాషణ మొదలుపెట్టాలో అప్పటికే పది సార్లయినా రిహార్సల్ చేసుకున్నాడు.

తన సీటు దగ్గరికి వచ్చిన చలపతిని చూసి "హలో చాలా బిజీగా వున్నట్టున్నారే" అని అడిగింది మీనాక్షి చలపతికి కొంతంత ధైర్యం వచ్చింది. అప్పు పుడుతుందనే నమ్మకం కలిగింది.

"అబ్బే ... మీరే బిజీగా ఉన్నారు" అన్నాడు చలపతి.

"ఏం బిజీనో.... ముష్టి ఏడువందల కోసం వెధవచాకిరీ చేయాలి-నేను తెచ్చే జీతం పెట్రోలు ఖర్చుకు సరిపోదు అంటారు మావారు."

చలపతి ఉత్సాహమంతా చప్పున చల్లారిపోయింది.

"ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నామన్న మాటేగాని నెలనెల అప్పులే" బాధ పడింది మీనాక్షి,

"అపునవును ధరలు ఎలా మండిపోతున్నాయండి, ఎక్కడి డబ్బూ సరిపోదు."

"కూర్చోండి"

"ఫరవాలేదు రెండు అర్జంటు ఫైళ్ళు వున్నాయి. వెంటనే పుటప్‌చేయమన్నారు డి.డి. మీ దగ్గర సరళాదేవి ఫైల్ ఒకటి వుండాలి"

"ఆ....ఆ...."

"అది కొంచెం కావాలి. రిఫరెన్స్ కోట్ చేయాల్సి వుంది."

సరళాదేవి ఫైల్ పట్టుకొని గబగబా తన సీటువైపు వెళ్ళిపోయాడు చలపతి.

ఆ తరువాత ఫ్యాను తనచుట్టూ తాను తిరిగినట్టు చలపతి ఆలోచనలు అతనిచుట్టే తిరిగాయి. శేషు "డాడీ సైకిలు ఏది?" అంటే తనేం చెప్పాలో ఆలోచించసాగాడు.

సాయంకాలం ఆఫీసునుంచి సరాసరి ఇంటికి వెళ్ళలేకపోయాడు తన చిన్ననాటి మిత్రుడొకడు బ్యాంక్ ఆఫీసర్. ఈ మధ్య చాలా సార్లు కలిసి ఇంటికి రమ్మన్నాడు.

అతని ఇంటికి వెళ్ళాడు చలపతి.

మిత్రుడు సుగుణాకర్ సోఫాలో విలాసంగా కూర్చొని సిగరెట్ తాగుతున్నాడు.

చలపతిని చూసి "ఓ వెల్ కమ్ వెల్‌కమ్" అంటూ ఆహ్వానించాడు.

డైనింగ్ టేబుల్ ముందు కూర్చోబెట్టి కాఫీ ఇప్పించాడు టి.వి ముందు కూర్చోబెట్టి కుశలప్రశ్నలు వేశాడు. మొహంనిండా నవ్వు పులుముకొని మాట్లాడడం తప్ప చలపతిమరో విషయం ఎత్తలేకపోయాడు.

"డాడీ చిన్న సైకిలు ఏది? శేషు చిన్న వోయిన మొహం కళ్ళల్లో మెదిలినప్పుడల్లా చలపతి మనసు విలవిల్లాడింది.

"నేనేం చేయనుబాబూ " అతని మనసు బోరున విలపించింది

తిరిగి చలపతి నడుస్తున్నాడు.

"బ్యాంకు బ్యాలెన్స్ అంటారే తనకెందుకు లేదు" అని ఆలోచించసాగాడు. ఎక్కువ వద్దు కనీసం రెండు వందల రూపాయలన్నా తన పేర బ్యాంక్‌లో వున్నాయా? వచ్చే జీతం ఎంతో పొదుపుగా వాడినా నెలనెలా చిల్లర దుకాణంలో బాకి, కూరగాయాల బాకి...బాకీలు తప్ప తనకు బ్యాంక్ బ్యాలన్సా!

సరే ఆ బాకిల్లో ఇదో బాకి. ఒక్క తొంభై రూపాయలు అప్పు దొరికితే.. కొడుకు నవ్వు మొహంచూసి తృప్తిగా ఊపిరి పీల్చేవాడు. అడగనిదే అమ్మైనా అన్నం పెట్టదు అంటారే! మరి తను ఎవరినీ అప్పు అడగనిదే డబ్బులు లేవని కృంగిపోతే ఎలా?

ఇంకా అడగడం ఎందుకు? జవాబు ముందే తెలుస్తున్నప్పుడు.

రాత్రి ఏడున్నరదాకా పార్కు మూలలో కూర్చుని ఆలోచిస్తున్నాడు చలపతి ఇంకో గంటలో తొంభై రూపాయలు దొరికితే.... కాని ఎలా? ఎవరిని అడిగేది.

మూర్తి గుర్తుకొచ్చాడు చలపతికి ఒకప్పుడు......బ్రహ్మచారులుగా వున్నప్పుడు తామిద్దరూ ఒకే గదిలో అద్దెకుండేవారు మురారి తప్పక తొంభై రూపాయలు సర్దగలడనే నమ్మకం వుంది చలపతికి

ఆ ఆలోచన రాగానే గబగబా మురారి ఇంటికి బయలుదేరాడు.

వెళ్ళేసరికి మురారి వున్నాడు చిరునవ్వులు కుశల ప్రశ్నలు, మర్యాదలు అన్నీ వున్నాయి. చివరికి అడగలేక అడిగలేక నోరువిప్పి అడిగాడు చలపతి.

"మా బాబు చిన్న సైకిలు కావాలని ఒకటే గొడవ చేస్తున్నాడోయ్! నెలా ఆరుకదా చేతిలో ఒక్క పైసా లేదు.

"నా పరిస్థితి అంతే చలపతి ఆఖరివారం వచ్చిందంటే గుండె దడపుడుతుందనుకో.

"ఒక్క తొంభై రూపాయలు ఏవర్నాయినా అడిగి ఇప్పిస్తే.... మళ్ళీ ఫస్టుకు ఇచ్చేస్తా" ప్రాధేయపడుతూ అడిగాడు చలపతి.

"అయ్యో! ఒక్క గంట ముందొస్తె బాగుండేది. ఒక్క ఫ్రెండ్‌కు అవసరమంటే రెండువందలు ఇప్పించాను. మా సేట్ దగ్గర మళ్ళీ అతని దగ్గరికి వెళ్ళాలంటే కష్టం అయినా ఏదయినా నగవుంటేకాని అతను అప్పు ఇవ్వడు.

నగలా ఉంటే ఎప్పుడో ఖర్చయిపోయేవి. చలపతి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఇక ఎక్కడికి వెళ్ళి ఎవరిని అడిగి లాభం లేదు. చేతి గడియారం అమ్మివేస్తె తొంభై రూపాయలు రావా!

టైం చూసుకున్నాడు ఎనిమిది నలభైఏడు దాటింది. మరునాడు గడియారం అమ్మి, కొడుక్కు చిన్నసైకిలు కొనాలని నిర్ణయించు కొని ఇంటివైపు నడిచాడు చలపతి.

చేతి గడియారం లేకపోతే ఎంత ఇబ్బందో అతనికి తెలుసు. కాని కొడుకు విచార దిగులు ముందు ఆ ఇబ్బంది ఎంత ?

"శేషు సాయంకాలం అన్నం తినలేదు. ఎదురింటి అబ్బాయి సైకిలు తొక్కుతుంటే చూస్తూ గడపలో నిల్చున్నాడు ఎంత చెప్పినాలోనికి రాలేదు" అని చెప్పింది శ్రీమతి.

"చూసిచూసి ఏమనుకున్నాడో ... ఆ అబ్బాయి దగ్గరికి వెళ్ళాడు. నా సైకిలు ముట్టుకోవద్దనీ ఆ అబ్బాయి కసురుకున్నాడు. మొహమంతా చిన్నబుచ్చుకుని శేషు దూరంగా నిల్చున్నాడు...." ఆ మాటలు విని చేమర్చిన కళ్ళను అదుపులో పెట్టుకుంటూ నిద్రబోతున్న కొడుకు తలను ప్రేమగా నిమిరాడు చలపతి.

మర్నాడు సాయంత్రం చేతి గడియారం అమ్మ జూపితే యాభై రూపాయల కంటే ఎక్కువ డబ్బులు రావన్నాడు. దుకాణదారు మరోసారి పరీక్షచేసి ఏదో లేదని నలభై రూపాయలే అది ఏదో తలచి ఇస్తున్నాట్టు మాట్లాడాడు.

గడియారం వాపసు తీసుకుని వచ్చేశాడు చలపతి.

మరో రెండు రోజులు గడిచాయి.

శేషు రోజురోజుకు మానసికంగా కృంగిపోయి దిగాలుపడి కూర్చుంటున్నాడు.

కొడుకును ఆ స్థితిలో చూసి తల్లి తండ్రి కుమిలిపోతున్నారు.

మరో మూడురోజులకు జీతం వస్తుందనగా ఒక సాయంకాలం చలపతి సంతోషకరమైన వార్తను మోసుకొచ్చాడు. ఆ నెలలో అదనంగా జీతం రాబోతున్నదట!

ఆ డబ్బులకు, గడియారం అమ్మితే వచ్చే డబ్బులు కలిపి కొడుక్కు సైకిలు తీసుకుపోవాలనుకున్నాడు చలపతి. గడియారం అమ్మే విషయం భార్యకు చెప్పలేదు. చిన్న సైకిలు ఇంటికి తెచ్చిన తరువాతగాని ఆ విషయం చెప్పకూడదనుకున్నాడు.

జీతం పడటానికి ఒకరోజు ముందుగానే గడియారం అమ్మేశాడు. మరునాడు జీతంలో ఎక్కువ వచ్చే 50 రూపాయలతో చిన్నసైకిలు తెస్తానని భార్యతో చెప్పాడు.

"ఇంతకుముందే ఇంటివోనర్ వచ్చాడు. రేపట్నించి 40 రూపాయలు అద్దె ఎక్కువ కావాలంటున్నాడు. ఎవరో 60 రూపాయలు ఎక్కువ ఇస్తామని వస్తున్నారట! కాని మనం నెలనెలకు అద్దె ఖచ్చితంగా ఇస్తున్నామని దయతలచి

40 రూపాయలే పెంచారట! "రేపు సాయంత్రంలోగ మీరు అద్దె తెచ్చిస్తారని నాకు తెలుసు. అని వెళ్ళిపోయారు" అని చెప్పింది శ్రీమతి.

తల పట్టుకుని చాపమీద కూలిపోయాడు చలపతి.

మర్నాడు పొద్దున పాలకని వెళ్ళిన శ్రీమతి ప్యాకెట్‌కు ఇరవైపైసలు పెరిగాయని వచ్చింది. బస్‌పాస్‌కు 15 రూపాయలు పెరిగాయి. నూనె 5 రూపాయలు పెరిగింది. కూరగాయలు కిలోకు అర్ధరూపాయ చొప్పున పెరిగాయని తెలిసింది.

ఆ విధంగా నిలపతి జీతంలో 50 రూపాయలు పెరిగిన పాపానికి అకస్మాత్తుగా ధరలు పెరిగి ఖర్చును 150 రూపాయలు పెంచాయి.

పెరిగిన 50 రూపాయల జీతమే కాకుండా గడియారం అమ్మితే వచ్చిన రూపాయలు ఇంటిలోకే ఖర్చయి ... పైగా బాకీని 60 రూపాయలకు పెంచాయి.

దిగాలుగా గోడకు చేరగిలబడి కూర్చున్న చలవతి కొడుకు విచారంగా గడపలో నిల్చోవడం చూశాడు. ఎదురుగా శేషు వయసే వున్న సీను ఆనందంగా కేరింతలు కొడుతూ సైకిలు తొక్కుతున్నాడు.

ఏమనుకున్నాడో ఏమో చలవతి. "నీకు సైకిలు కావాలా నాన్నా ... కొనిస్తా పా" అంటూ కొడుకుని ఎత్తుకుని బజారుకు బయలుదేరాడు.

షాపతను చలపతి అడిగిన రకరకాల చిన్న సైకిళ్ళు చూపించాడు. నవ్వుతూ మాట్లాడితే ఎక్కడ ఉద్ధర అడుగుతాడోనని కాబోలు.... ముభావంగా ముఖమంతా ముడుచుకుని ఆ సైకిళ్ళు చూపించసాగాడు షాపతను.

"ఇది 160 రూపాయలు కదూ....! బాగుంది చూశావా నాన్నా! ఇది సీను సైకిలుకంటే బాగుంది కదూ! ఏదీ ఒక్కసారి తొక్కిచూడు .. " కొడుకుని అ సైకిలుమీద కూర్చోబెట్టాడు చలపతి.

శేషు కళ్ళలో ఎంత ఆనందమో .. గర్వమో....! తండ్రి చేయి తనచుట్టూ వుండగా సంబరంగా అటూ ఇటూ రెండుసార్లు సైకిలు తొక్కాడు.

కొడుకు మొహంలోని ఆనందాన్ని తృప్తిగా చూసుకున్నాడు కలపతి.

ఆంధ్రభూమి వీక్లీ 10-2-1981